

కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కబుర్లు

అమ్మ అంటే దేవత!



మా అమ్మ అంకరాజు సత్యవతీదేవి. స్త్రీ సాధికారతకి మారు పేరు.

చాలా చిన్న వయసులో పెళ్ళి జరిగింది. అన్నయ్య పుట్టాక ఆంధ్రా మెట్రిక్ కట్టి పాసయింది. ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యని రోజుల్లో, ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజ్‌లో పేరు నమోదు చేయించుకుని, పిన్ని కూతురు సావిత్రికి కూడా చేయించింది.

మొదటి ఉద్యోగం సెన్సస్ డిపార్ట్‌మెంట్‌లో వచ్చింది. ఆడపిల్లలిద్దరూ ధైర్యంగా సెన్సెస్ లెక్కలు తీసుకోడానికి పల్లెటూళ్ళకీ, వేరే ఊళ్ళకీ వెళ్ళేవారు. ట్రావెలర్స్ బంగళాలో వుండేవారట. అందులో ఒక చౌకీదార్ తప్ప మనుషులుండేవారు కారట. ఈ ట్రావెలర్స్ బంగళా అనగానే మనకి దెయ్యాల సినిమాలు గుర్తొస్తాయి కదూ! అలాంటి చోట ఇద్దరే ఆడపిల్లలు వుండి పక్కనున్న థియేటర్‌లో 'జబ్ ప్యార్ కిసీసే హోతా హై' లాంటి సినిమాలు, రోజూ చూసేవాళ్ళట. ఆ పాటలన్నీ పుస్తకాలు కొనుక్కుని కంఠతా పట్టేవాళ్ళట. చెరుగ్గడలూ, మొక్క జొన్నపొత్తులూ కొనుక్కుని తింటూ ఎంత దూరం అయినా నడిచి వెళ్ళేవారుట.

ఒకసారి ఊహించండి. 1960లలో ఆడవాళ్ళు ఇద్దరే ఉద్యోగం చేస్తూ, ఒంటరిగా ట్రావెలర్స్ బంగళాలో వుండడం... అప్పటినుండీ అంతే ధైర్యం మా అమ్మకి.

అలా సెన్సస్ తర్వాత ఆర్.టీ.సీలో ఉద్యోగం వచ్చింది. అందరూ కండక్టర్లూ, డ్రైవర్లూ వుంటారు. అందులో ఉద్యోగం వద్దన్నారట దగ్గర బంధువులు.

కానీ అమ్మ ఆర్.టీ.సీలో చేరింది. "ప్రజాసేవయే మన కర్తవ్యం" అని ప్రతి బస్సు మీదా వుంటుంది. అలాగే మా అమ్మ కూడా జీవితాంతం ప్రజాసేవలోనే గడిపింది. మా బంధువులు చాలామందికి అమ్మ ఆర్.టీ.సీలోనే ఉద్యోగం వేయించింది.

అమ్మ జీవితంలోకి అన్నయ్యతో బాటు నేను కూడావచ్చాను. నాకు పాలిచ్చి, కేంటిన్‌లో రత్నమ్మ అనే అవ్వ దగ్గర వుంచి ఉద్యోగానికి వెళ్ళేదిట.

తర్వాత అమ్మ పేరు మీద ఆర్.టి.సీ వాళ్ళు ఉండటానికి ఒక క్వార్టర్ ఇచ్చారు.

క్వార్టర్ అంటేనే, ఇంట్లో నాలుగో భాగం. హాలూ, బెడ్‌రూమూ, ముందో వరండా, వెనకో వరండా వుండేది ఆ ఇంట్లో.

"పాపాయి.. మా అమ్మాయి పురుడు పొసుకుంటాం.."

"పాపాయి నాన్నగారికి వైద్యం చేయించాలి నీ ఇంట్లో కొన్ని రోజులుంటాం.."

"పాపాయి మా అమ్మాయి పెళ్ళి...." ఇలా 'పాపాయి' అని ఎవరైనా సాయం అడిగితే అమ్మ కాదనకుండా ఒప్పుకునేది. ఈ ఇల్లు మీదే అనుకోండి" అనేది.

ఆ ఇల్లు పుష్పక విమానంలా ఎందరొచ్చినా అందరికీ సరిపోయింది. పెద్దమ్మ కూతుళ్ళ పెళ్ళిళ్ళూ, పురుళ్ళూ, బంధువుల వైద్యాలూ చివరికి చిన్న తాతయ్య పోయినప్పుడు వాళ్ళ ఇల్లు పాడు పెడితే, మొత్తం కుటుంబాన్ని దగ్గర దగ్గర ఏడాది పాటు ఇంటిల్ల పాదికీ ఆశ్రయమిచ్చింది.

మా పెద్దమ్మ నాగ్‌పూర్ నుండి ఒక చీటీ రాసి "ఈ అమ్మాయికి ఉద్యోగం చూడు.. మీ ఇంట్లో పెట్టుకుని.. ఈ అమ్మాయికి సంబంధం చూడు", "ఆడపిల్లలకి ఊరు చూపించు" అని హైద్రాబాద్‌కి తోలేసేది. అమ్మ కాదనేది కాదు.

జీవితం అంతా ఒకరికి సాయం చెయ్యడమే కానీ, ఒకరి సాయం ఆశించలేదు. మమ్మల్నిద్దరినీ చదివించింది. పెంచి, పెద్ద చేసింది.

మాతోబాటు మా పెద్దమ్మ పిల్లలందరూ వాళ్ళ రాష్ట్రంలో తెలుగు చదువులేదని మా ఇంట్లోనే పెరిగి డాక్టర్లూ, ఇంజనీర్లూ అయ్యారు.

చుట్టూ పిల్లలు అల్లరి చేస్తుంటే, పి.సుశీల లాంటి గొంతుతో "వాన కాదు వాన కాదు వరదా రాజా" అని పాడేసుకుంటూ డ్రాయింగ్స్ వేసేది. తియ్యని గొంతుతో పాటల కాంపిటీషన్‌లో ప్రైజులు తెచ్చుకుంటూ, ఆర్.టీ.సీలో 'కోకిల సత్యవతి' అనిపించుకుంది.

ఘంటసాలగారితో కూడా ఒక వేదిక మీద పాడిన ఘనత అమ్మది.



అమ్మ జీవితం ఇలా సాగుతుండగా, నేను పెద్దదాన్ని అయ్యాను.

"అమ్మా నేను ఫలానా ఊరు ఎక్స్‌కర్షన్ వెళ్తాను, రచనలు చేస్తాను, ఇలా ఏం అడిగినా అమ్మ "ఓ అలాగే" అని సహకారం అందించేది. పొరుగింటి వాళ్ళు టీ.వీలో క్విజ్‌లు చూడడానికి వెళ్తే "ఈ క్విజ్‌లూ అవీ మేం చూడం" అన్నారని నేను మా అత్తగారింటిలో వుండగా చెపితే, వెంటనే టీ.వీ కొని రిక్షాలో పట్టుకుని వచ్చింది.

"ఇలా అడిగినదల్లా చేసి తలకెక్కించుకుంటావా సత్యవతీ?" అని మా అత్తగారు అంటే,

"అది అదృష్టవంతురాలు అది పుట్టినప్పుడే నాకు ఈ ఉద్యోగం వచ్చింది" అంది నవ్వుతూ.

నా ఎదుగుదలలో రచయిత్రిగా, ప్రతి అడుగులో మా అమ్మ సహకారం వుంది.

నా ప్రతి విజయం తనదే అనుకుని పొంగిపోయేది. నాతో ఏ.ఎన్.ఆర్‌గారిని కలిసినప్పుడు, నా సినిమా షూటింగ్‌లకీ, ప్రీవ్యూలకీ వచ్చినప్పుడు ఏనుగు ఎక్కినంత సంబర పడిపోయేది.



బస్‌లో కానీ ఇంటికొచ్చిన వాళ్ళకి కానీ సినిమా ఇంటర్వెల్‌లో బాత్‌రూంల దగ్గర కానీ "మా అమ్మాయి ఎవరో తెలుసా?" అంటూ నా గురించి నలుగురుకి చెప్పి, ప్రేక్షకులని పోగుచేసుకునేది.

అక్కడికి "మా అమ్మాయి ఎవరనుకున్నారు?" అని నేనేదో ప్రధానమంత్రిని అన్నట్లు, గర్వంగా 'రచయిత్రి' అని చెప్పుకునేది.

మా అమ్మ 50 ఏళ్ళ వయసులో నల్గొండకి హైదరాబాద్ నుండి, నలుగురు మనవలుండగా అప్ అండ్ డౌన్ చేసి ఉద్యోగం చేసింది. ఎనభై ఏళ్ళ వయసులో షిరిడీలో ఒక్కతే వండుకు తింటూ, బాబా సన్నిధిలో నెలలు నెలలు గడిపేది.

ఏ స్త్రీకి ఇంత స్వాతంత్రం వుంటుంది? తను అనుకున్నది చేసేసేది.

చంద్రబాబు నాయుడు గెలిచి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినప్పుడు అన్నయ్యనీ నన్నూ "ఒకసారి చంద్రబాబు నాయుడిని చూపించండి" అని అడిగింది.

"మా కంత స్థాయి లేదన్నాం."

తర్వాత ఒక గంటన్నరకి మా ఇద్దరి సెల్‌లకీ చంద్రబాబు నాయుడి తలమీద చెయ్యి పెట్టి ఆశీర్వదిస్తున్న అమ్మ ఫోటో వచ్చింది. అంతేకాదు ఆయన చేతిలో నేను రాసిన లీడర్ బుక్! మేం అందరం తెల్లబోయాం. ఇప్పటికీ మా పిల్లలు అందరికీ ఆ ఘట్టం గర్వంగా చెప్పుకుంటారు.

"ఎలా అమ్మా?" అని అడిగితే,

"తెలుగుదేశం ఆఫీస్‌కి వెళ్ళి, ఆయనకి 'అమ్మలాంటి దాన్ని ఆశీర్వదించాలి' అన్నాను.

"రండి.. అని తీసుకెళ్ళి కూర్చొపెట్టారు. ఓ గంట తర్వాత ఆయన వచ్చారు. నా గురించి విని ' రా అమ్మా' అని తీసుకెళ్ళి ఆయన నా కాళ్ళకి దణ్ణం పెట్టి, నా చేత విజయోత్సవ కేక్ కట్ చేయించారు" అని చెప్పింది.

ఆ గట్స్ నాకు కూడా కొన్ని అబ్బాయి. నేను తెలుగు సినిమా రచయితల సంఘానికి హానరరీ ప్రెసిడెంట్ అయ్యాననీ, రెండవసారి సెన్సార్ బోర్డ్ మెంబర్ అయ్యాననీ చివరిగా అమ్మ నా నోట విన్న శుభవార్తలు.



నేను రెండుసార్లు నేషనల్ అవార్డ్స్ ఫిల్మ్ జ్యూరీ మెంబర్ని అయ్యానని ఎంతో మురిసిపోయింది.

"స్టార్ హోటల్‌లో ఎలా వుంటుందే?" అని అడిగిందని, పోయిన ఏడే ముంబై తీసుకెళ్ళి రేడిసన్ ఇంటర్నేషనల్ హోటల్‌లో ఐదు రోజులు వుంచి సిద్ధి వినాయక, మహలక్ష్మీ మందిరం అన్నీ చూపించాను.

తేజాబ్, అంకుష్ తీసిన డైరెక్టర్‌గారు ఎన్. చంద్రగారు వారింటికి భోజనానికి పిలిస్తే మమ్మల్ని "నా కూతురికి పెద్ద పెద్ద వాళ్ళు తెలుసు" అని మురిసిపోయింది.

"పాస్‌పోర్ట్ చేయించావు.. ఎందుకూ, చెదలు పడ్తోంది" అంది అని ఆవిడ పుట్టిన రోజుకి మలేషియా తీసుకెళ్ళాను. ఏ పసిపిల్లలు కనిపించినా, వాళ్ళతో ఫోటోలు తీసుకునేది. ఆవిడ జీవితాన్ని చిన్న పిల్లలా అనుభవించింది.



ఆవిడలో అమాయకత్వం పాలు చాలా వుండటం వల్ల అంత నిశ్చింతగా, సంతోషంగా గడిపేది.

"పాలూ నీళ్ళూ" అనే సీరియల్ ఈ టీవీలో రెగ్యులర్‌గా చూసేది. అది డబ్బింగ్ సీరియల్, ఓ శుక్రవారం ఎపిసోడ్‌లో అందులో ప్రధాన నటుడు, నిళగళల్ రవికి హార్ట్ ఎటాక్ వచ్చి ఆసుపత్రికి వెళ్ళాడు. మా అమ్మ శనివారం వెళ్ళి గుడిలో అతనికి ఏమీ కాకూడదని కొబ్బరి కాయ

కొట్టింది. అప్పట్లో నేను ముమ్మరంగా టీ.వీ సీరియల్స్ రాస్తున్నాను.

"అమ్మా నీకు తెలీదా? పదిహేను రోజుల ముందే షూటింగ్ అయిపోయి వుంటుందని. నాతో షూటింగ్‌లకి వస్తావుగా?" అంటే

"ఏమోనే బాధేసింది. అతనికి గుండెనెప్పి వస్తే" అంది.



ఎవరికి జబ్బు చేసినా షిరిడీ వెళ్ళి వాళ్ళ పేర్లమీద అఖండంగా పూజలు చేయించేది. తాజ్‌వుద్దీన్ బాబాని ఎక్కువగా నమ్మేది.

రిమోట్ వచ్చిన కొత్తలో పి.వినరసింహారావుగారు చనిపోయినప్పుడు, ఆవిడ శవాన్ని తదేకంగా ఛానెల్ మార్చకుండా చూస్తుంటే, నేను ఛానెల్ మార్చాను. భవాని గారనే ఒక సాంస్కృతిక సంస్థ ఆవిడ మాట్లాడ్తోంది స్త్రీల వృత్తి ఉద్యోగాల గురించి, మా అమ్మ ఆశ్చర్యంగా "ఈవిడ కూడా వెళ్ళిందనమాట ఆయన పోతే" అంది. ఛానెల్స్ మారిస్తే పాపం సినిమా చూస్తుండగా "తెలుగు సినిమా లో హిందీ పాట వచ్చిందేవిటే?" అనేది.

షిరిడీలో సెక్యూరిటీ గార్డ్స్, అక్కడ దుకాణాల వాళ్ళూ, పూజారులూ అందరూ ఈవిడని హైదరాబాద్ అమ్మ అనేవారు. అందరికీ తనతో తీసుకెళ్ళి స్పెషల్ దర్శనాలు చేయించేది.

మనవళ్లని గుండెలకేసుకుని పెంచింది. నల్గొండలో పనిచేసినప్పుడు, నలుగురినీ సెలవలకి, చంటివాళ్ళని వేసుకుని వెళ్ళిపోయేది. మగపిల్లలేమో కొబ్బరి చెట్టుకి నిప్పు పెట్టడం లాంటి పిచ్చ అల్లరి చేసేవారు. భరించేది. అమృతంలా వంట చేసేది.

"బామ్మా.. అమ్మమ్మా" అంటూ ఆవిడ చెంగు చాటున దూరేవాళ్ళు, అల్లరంతా చేసేసి పెద్దయి అన్నయ్య పెద్ద కొడుకు రవిచంద్ర ఇండియన్ ఆర్మీలో లెఫ్ట్ నెంట్ కల్నల్ అయ్యాడు. ఇప్పుడు External affairs Director గా వున్నాడు ప్రస్తుతం ఢిల్లీ లో. రెండో వాడు శరత్ చంద్ర 'చాయ్ బిస్కెట్', 'ఫస్ట్ షో,' 'చాయ్ షాట్స్'కి ఫౌండర్ అయి మేజర్ లాంటి సినిమాలు తీసి నిర్మాత అయ్యాడు.

నా పెద్ద కొడుకు అశ్విన్ ఆర్కిటెక్ట్, వెరైజిన్‌లో ఆసియాకి హెడ్, రియల్ ఎస్టేట్స్, నా చిన్న కొడుకు క్రిష్ణకాంత్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ చేసి, సియాటిల్‌లో గూగుల్ లో చేస్తున్నాడు. మనవళ్ళనే కాదు కోవిడ్ టైంలో పుట్టిన మునిమనవడిని కూడా ఏడాది వరకు పెంచింది మా అమ్మ.

మనవళ్ళనీ, కొడుకునీ, కూతుర్నీ చూసుకుని మహా గర్వం మా అమ్మకి. అను నిత్యం "సాయిరాం" నామం చేసేది. "ఆయన్ని పడుకోనీవే కాసేపు అర్ధరాత్రయినా.." అనే వాళ్ళం. ఎంత జోక్ చేసినా కోపం తెచ్చుకునేది కాదు. మా కోసమే సాయి నామం చేసేది.

అలా.. నేను సియాటిల్ నా చిన్నకొడుకు దగ్గరకి, మే 12న వెళ్ళాను. 17న మా అమ్మ శివసాయిజ్యం పొందింది.

నేను వెళ్ళిన ఐదోనాడు అమ్మ పోయిన వార్త విని, ఆ సాయంత్రమే బయలుదేరి 19న ఇండియా వచ్చేసాను.

అమ్మ నిద్రలో నిశ్చింతగా పోయింది.

"చూసావా నా కూతురికి నేనంటే ఎంతో ప్రెమో! వచ్చేసింది" అంటూ చుట్టుపక్కల వాళ్ళకి చెప్తున్నట్లుగా వుంది ఆ ఫేస్.

నేను ఎప్పుడు వెళ్ళినా, కారు దిగుతున్నా ఎక్కుతున్నా చుట్టు పక్కల షాప్‌ల వాళ్ళకీ, ఇళ్ళవాళ్లకీ " అమ్మాయి.. రచయిత్రి.." అంటూ అరిచి చెప్పేది. ఎంత విసుక్కునేదానినో.. ఇప్పుడెవరు అలా గర్వంగా చెప్పుకుంటారూ?

నా స్నేహితులందరికీ కూడా అమ్మ అంతే ప్రేమని పంచేది. వాళ్ళందరితో ఒక స్నేహితురాలిలాగా కబుర్లు చెప్పేది, ఫోన్‌లు చేసి క్షేమ సమాచారాలు కనుక్కునేది. వాళ్ళకి బాలేదంటే సాయిబాబాకి పూజ చేస్తాను, ఏమీ అవ్వదు అని ధైర్యం చెపుతుండేది.

ఏ సమయంలో ఫోన్ చేసినా "అన్నం తిన్నావా ఒంట్లో ఎలా వుంది?" అనేది.

ఇప్పుడెవరు అలా అడుగుతారు? నాకు ఆపరేషన్‌లు అయినప్పుడు ఎంత సేవ చేసిందో.. నాకు ఆ ఛాన్స్ ఇవ్వలేదు. ఎవరి చేతా చేయించుకోకుండా పువ్వులా రాలిపోయింది. ఇంక నా ఫోన్ మోగినప్పుడు అందులో "అమ్మ" అన్న అక్షరాలు రావు అనుకుంటే గుండెలో గునపంతో పొడిచినట్లుగా అవుతోంది.



87 ఏళ్ళ జీవితం పూర్తిగా సఫలీకృతం అవ్వడమంటే ఏంటో అమ్మ జీవితాన్ని చూస్తే అర్థమవుతోంది.

"ఇకనుండీ అమ్మా నాన్నా ఇద్దరూ లేరు మాకు! "

Post your comments





